రామోజీరావు మృతికి కలెక్టర్ సంతాపం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

తెలుగు భాషకోసం, జాతి కోసం విస్తృతమైన కృషి చేసిన పెద్దలు రామోజీరావు అకాల మృతి పట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన దంపతులు సంతాపం వ్యక్తం చేస్తూ శనివారం ఓ ప్రకటన ద్వారా పేర్కొన్నారు. ఆయన చేసిన కృషి మరువలేనిదని, స్వయం కృషితో అత్యంత ఉన్నత స్థితికి చేరి తెలుగు వారి చరిత్రలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని కల్పించుకుని అంతిమ శ్వాస విడిచిన రామోజీ రావు కు శ్రద్ధాంజలి ఘటించారు. వ్యక్తిగతంగా మాకు ఎల్లప్పుడూ మద్దత్తుగా నిలిచే రామోజీ రావు అస్తమయం మాకు తీరని లోటు అని పేర్కొన్నారు



రామోజీరావుతో ఉన్న కలెక్టర్ సృజన దంపతులు (ఫైల్)

రామోజీరావు మతికి కర్నూలు ఎంపి సంతాపం

కర్నూలు క్రైమ్: ఈనాడు గ్రూప్ సంస్థల ఛైర్మన్ రామోజీరావు మృతి పై కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సామాన్య కుటుంబంలో జన్మించి ఎన్నో విజయాలు సాధించిన రామోజీరావు జీవితం అందరికి ఆదర్శమన్నారు. అక్షర యోధుడుగా పేరున్న రామోజీరావు తెలుగు రాష్ట్రాలకు, దేశానికి అందించిన సేవలు ఎనలేనివని నాగరాజు తెలిపారు. ఈనాడు గ్రూపు సంస్థల స్థాపనతో వేల మందికి ఉపాధి కల్పించారు. మీడియా రంగంలో రామోజీది ప్రత్యేకమైన శకమన్నారు. రామోజీరావు ఆత్మకు శాంతి చేకూరాలన్నారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

విస్తారంగా వర్షాలు...

- పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు - ముంపునకు గురవుతున్న పొలాలు

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

నైరుతి రుతుపవనాల ప్రభావంతో జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరపిలేని వర్షాలతో ఉరుములు, మెరుపులతో కుండపోతగా వర్షాలు కురుస్తున్నాయి. సాధారణ వర్షపాతం కంటే ఇప్పటికే అధిక వర్షపాతం నమోదవుతోంది. శనివారం జిల్లాలో అత్యధికంగా పత్తికొండ 60.8, చిప్పగిరి 58.6, తుగ్గలి 56.2, మంత్రాలయం 52.2, ఓర్వకల్లు 48.2, కర్నూలు అర్బన్ 22.2, మద్దికెర 21.8, ఆస్పరి 8.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. వర్షం కురిసిన ప్రాంతాల్లో వాగులు, చెరువులు, కుంటలు పొంగిపొర్లుతున్నాయి. ఇప్పటికే చాలా పొలాల్లో సారవంతమైన మట్టి కొట్టుకుపోయింది. ఎక్కడ చూసినా పంట పొలాల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. ఇంకా మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖాధికారులు తెలుపుతున్నారు. మట్టి మిద్దెలు కూలిపోతున్నాయి. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న కాలనీలు, గ్రామాలు నీటితో నిండుకున్నాయి. ఇంకా జూన్ మొదటి వారానికి ఇంతటి వర్షం కురవడం అరుదుగా ఉందని, ఇలాగే కురిస్తే పొలాలు కోతకు గురయి సారవంతమైన మట్టి సైతం కొట్టుకుపోయి నేల రాయిబారుతుందని, తద్వారా దిగుబడులు తగ్గుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పొలాల్లో ఎరువులు వేసి దుక్కులు చేసుకున్న పొలాల్లో మట్టి కొట్టుకుపోయింది. సారవంతమైన మట్టి కొట్టుకుపోతే సరైన పంటలు పండవని, తద్వారా దిగుబడులు తగ్గుతాయని రైతులు పేర్కొంటున్నారు. మృగశిర కార్తె ముగిశాక సాగుకు అనుకూలంగా ఉంటుందని, వ్యవసాయ పంటల సాగు మొదలు పెట్టాలని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. వాస్తవానికి ఇప్పుడు ఇంతగా కురిసిన వర్షం విత్తన సాగు తర్వాత కురవకపోతే గతేడాదిలా పంటలు వచ్చే సమయానికి వర్షం లేకుంటే తీవ్ర నష్టాలు చవి చూడాల్సిన పరిస్థితులు ఉంటాయని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రైతుల వ్యవసాయ సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులను ఆర్‌బికెల్లో అందుబాటులో పెట్టామని, రైతులు అధైర్య పడొద్దని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. జూన్ మాసంలో సాధారణ వర్షపాతం 77.7 మిల్లీ మీటర్లకు గాను 71.8 మిల్లీమీటర్లు కురిసింది. జూన్ మొదటి వారంలోనే సాధారణ వర్షపాతం అధిగమిస్తే జూన్ ముగిసే సరికి అత్యధికంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. అదే జరిగితే రైతులకు పొలాల్లో తీవ్ర నష్టాలు జరిగే అవకాశం ఉందని రైతులు తెలుపుతున్నారు. ఏదేమైనా రైతులకు అన్ని విధాలుగా అధికారులు, ప్రభుత్వం అండగా ఉండాలని కోరుతున్నారు.

రోడ్లను పట్టించుకోని అధికార యంత్రాంగం

జిల్లాలో చాలా గ్రామాలకు రోడ్లు వరద నీటితో కోతకు గురయ్యాయి. అంతంత మాత్రంగానే ఉన్న రోడ్లన్నీ మరింత అధ్వానంగా, ప్రమాదకరంగా తయారయ్యాయి. గుంతలతో రాత్రిళ్లు ప్రయాణించాలంటే ప్రయాణికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. వరద నీటితో ప్రయాణిస్తున్న వాహనదారులకు నీటితో నిండిన గుంతలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం గ్రామీణ, మండల కేంద్రాల్లో రోడ్ల దుస్థితిని గుర్తించి వెంటనే మరమ్మతులు చేసి వాహనదారుల ప్రాణాలను కాపాడాలని కోరుతున్నారు.

సారవంతమైన మట్టి కొట్టుకుపోయి పొలాల్లో నిలిచిన నీరు

వర్షం వస్తే వెళ్లలేని కేతవరం గ్రామీణ రోడ్డు

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

- యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్ కుమార్

ప్రజాశక్తి కర్నూలు కార్పొరేషన్

రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె. సురేష్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కర్నూలు కార్మికకర్షక భవన్‌లో జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశం జిల్లా అధ్యక్షులు రవికుమార్ అధ్యక్షతన నిర్వహించారు. రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ పాటి మాట్లాడారు. నూతన ప్రభుత్వం విద్యారంగంలో నెలకొన్న అనేక సమస్యలు 117 జీవోల రద్దు , పిఆర్‌సి వెంటనే ప్రకటించాలన్నారు. విద్యా రంగంలో నెలకొన్న అనేక సమస్యలను ఉపాధ్యాయ సంఘాలతో సంప్రదించి పరిష్కరించాలన్నారు. ఉపాధ్యాయులకు బోధినేతర పనులను అప్పగించకుండా చూడాలన్నారు. విద్యారంగా అభివృద్ధికి నూతన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షులు దావీదు ,సహాఅధ్యక్షులు హేమంత్ కుమార్, ఆర్థిక కార్యదర్శి యెహోషువ జిల్లా కార్యదర్శిలు తిమ్మన్న, దుర్గాప్రసాద్, ఖాసిం గాదిలింగప్ప ,శ్రీనివాసులు నరసింహ, భాస్కర్, రాష్ట్ర కౌన్సిలర్‌లు ఎల్లప్ప, జయరాజు, హనుమంతు, సోమన్న, హనుమంతు, మల్లయ్య ,వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్ కుమార్

టిడిపి హవా..!

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని రెండు పార్లమెంట్, 14 అసెంబ్లీ నియోజకవర్గాలకు నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో టిడిపి కూటమి హవా కనపరిచింది. రెండు పార్లమెంట్ స్థానాలతో పాటు 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో టిడిపి కూటమి అభ్యర్థులు విజయం సాధించారు. వైసిపి రెండు అసెంబ్లీ నియోజకవర్గాలతో సరిపెట్టుకుంది. కర్నూలు ఎంపీ స్థానంలో టిడిపి అభ్యర్థి బస్తిపాటి నాగరాజు సమీప ప్రత్యర్థి వైసిపి ఎంపి అభ్యర్థి బివై రామయ్యపై 1,11,298 ఆధిక్యంతో విజయం సాధించారు. నంద్యాల ఎంపి స్థానంలో టిడిపి అభ్యర్థి బైరెడ్డి శబరి సమీప ప్రత్యర్థి వైసిపి అభ్యర్థి పోచ బ్రహ్మానంద రెడ్డిపై 1,11,975 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. ఆదోని అసెంబ్లీలో బిజెపి అభ్యర్థి వాల్మీకి పార్థసారథి తన ప్రత్యర్థి వైసీపీ అభ్యర్థి సాయి ప్రసాద్ రెడ్డిపై 18,164 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఆలూరు అసెంబ్లీలో టిడిపి అభ్యర్థి వీరభద్ర గౌడ్ పై వైసీపీ అభ్యర్థి బుసినే విరూపాక్షి 2,831 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. మంత్రాలయం అసెంబ్లీలో టిడిపి అభ్యర్థి ఎన్ రాఘవేందర్ రెడ్డిపై వైసీపీ అభ్యర్థివై బాలనాగిరెడ్డి 12,805 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఎమ్మిగనూరు అసెంబ్లీలో వైసీపీ అభ్యర్థి బుట్టా రేణుకపై టిడిపి అభ్యర్థి బీవీ జయ నాగేశ్వరరెడ్డి 15,837 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. కోడుమూరు అసెంబ్లీలో వైసీపీ అభ్యర్థి ఆదిమూలపు సురేష్ పై టిడిపి అభ్యర్థి బొగ్గుల దస్తగిరి 21,583 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. పత్తికొండ అసెంబ్లీలో వైసీపీ అభ్యర్థి కంగాటి శ్రీదేవిపై టిడిపి అభ్యర్థి కెఈ శ్యామ్ కుమార్ 14,211 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. కర్నూలు అసెంబ్లీలో వైసీపీ అభ్యర్థి ఏఎండి ఇంతియాజ్ పై టిడిపి అభ్యర్థి టీజీ భరత్ 18,876 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. పాణ్యం నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి కాటసాని రాంభూపాల్ రెడ్డిపై టిడిపి అభ్యర్థి గౌర చరిత రెడ్డి 40,591 మెజారిటీతో విజయం సాధించారు. సిపిఎం అభ్యర్థి 3,081 ఓట్లతో మూడో స్థానాన్ని దక్కించుకున్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి గంగుల బ్రిజేంద్రా రెడ్డిపై టిడిపి అభ్యర్థి భూమా అఖిలప్రియ 12,037 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. బనగానపల్లెలో వైసీపీ అభ్యర్థి కాటసాని రామిరెడ్డిపై టిడిపి అభ్యర్థి బీసీ జనార్ధన్ రెడ్డి 26,258 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. డోన్ లో ఆర్థిక శాఖ మంత్రి, వైసీపీ అభ్యర్థి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిపై టిడిపి అభ్యర్థి కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి 6,049 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. శ్రీశైలం నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి శిల్పా చక్రపాణి రెడ్డిపై టిడిపి అభ్యర్థి బుడ్డా రాజశేఖర్ రెడ్డి 6,385 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. నందికొట్కూరు నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి దారా సుధీర్ పై టిడిపి అభ్యర్థి గిత్త జయసూర్య 10,315 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. నంద్యాల నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డిపై టిడిపి అభ్యర్థి ఎన్ఎండి ఫరూక్ 12,333 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

దంచికొట్టిన వాన : ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా నాలుగు రోజులుగా వాన దంచికొట్టింది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షానికి వర్షపు నీరు రోడ్లపై ప్రవహిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పలు ప్రాంతాల్లో వాగులు, వంకలు పొంగి పారుతున్నాయి. రోడ్లు తెగిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గాలి వానకు పలు ప్రాంతాల్లో చెట్లు నేలకొరిగాయి.

మంత్రి పదవులు దక్కేదెవరికి : ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 14 అసెంబ్లీ స్థానాలు ఉండగా టిడిపి కూటమి ఊహించని స్థాయిల్లో సీట్లను దక్కించుకుంది. 11 అసెంబ్లీ నియోజకవర్గాల్లో టిడిపి అభ్యర్థులు, ఒక చోట బిజెపి అభ్యర్థి గెలుపొందారు. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పాటు కానుంది. దీంతో ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి గెలుపొందిన కూటమి అభ్యర్థుల్లో ఎవరికి మంత్రి పదవులు దక్కుతాయోనన్న ఉత్కంఠ నెలకొంది. ఉమ్మడి కర్నూలు జిల్లాకు ఇద్దరికి మంత్రి పదవులు ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గెలుపొందిన ఎమ్మెల్యేల్లో ఎక్కువ మంది మంత్రి పదవిని ఆశిస్తున్నారు. డోన్ నుంచి గెలుపొందిన కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి, బనగానపల్లె నుంచి గెలుపొందిన బిసి జనార్ధన్ రెడ్డి, నంద్యాల నుంచి గెలుపొందిన ఎన్ఎండి ఫరూక్, ఆళ్లగడ్డ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన అఖిలప్రియ మంత్రి పదవి రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. పాణ్యం నుంచి గెలుపొందిన గౌరు చరిత రెడ్డి, కర్నూలు ఎమ్మెల్యే టిజి భరత్, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బివి జయనాగేశ్వరరెడ్డి మంత్రి పదవి రేసులో ఉన్నట్లు సమాచారం.

రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేస్తున్న సోమిశెట్టి వెంకటేశ్వర్లు, తదితరులు

అక్షర యోధునికి అశ్రు నివాళులు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత, మీడియా మొఘల్, పద్మవిభూషణ్ చెరుకూరి రామోజీరావు మృతి పట్ల తెలుగుదేశంపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శనివారం టిడిపి జిల్లా కార్యాలయంలో నగర పార్టీ అధ్యక్షులు నాగరాజు యాదవ్ ఆధ్వర్యంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ రామోజీరావు ఒక సామాన్య కుటుంబంలో పుట్టి అంచెలంచెలుగా ఎదిగి అక్షర యోధుడుగా ఒక మార్గదర్శిగా నిజాయితీ విలువలతో కూడిన జర్నలిజంతో తెలుగువారి గుండెల్లో ప్రత్యేక స్థానాన్ని ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. తెలుగు జర్నలిజాన్ని ఓ మలుపు తిప్పిన ఘనత రామోజీరావుకు దక్కుతుందని అన్నారు. ఎన్నో మరపురాని సినిమాలు నిర్మించి, రామోజీ ఫిలింసిటీ నిర్మించి సినిమా రంగానికి ఎంతో సేవ చేశారని పేర్కొన్నారు. జర్నలిజం, సాహిత్యంలో ఆయన అందించిన సేవలకు గాను పద్మభూషన్, పద్మవిభూషన్ అందుకున్నారని అన్నారు. ఆయనకు సంతాపం తెలుపుతూ వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

వెల్దుర్తి: వెల్దుర్తి టిడిపి కార్యాలయంలో టిడిపి మండల అధ్యక్షుడు బలరాం గౌడ్, బొమ్మన రమాకాంతరెడ్డి అక్షర యోధుడు ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావు మృతికి సంతాపంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

పత్తికొండ : రామోజీరావు జీవితం అందరికీ ఆదర్శమని టిడిపి నాయకుడు గుడిసె నరసింహుడు పేర్కొన్నారు. శనివారం పత్తికొండ టిడిపి కార్యాలయంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు ఈనాడు గ్రూప్ సంస్థల ఛైర్మన్ రామోజీరావు మతిపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

రామోజీరావు మృతికి సంతాపం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రామోజీరావు అనారోగ్యంతో నేడు తుది శ్వాస విడిచారని, వారి అకాల మరణానికి సిపిఐ కర్నూలు జిల్లా సమితి తరపున ప్రగాఢ సంతాపాన్ని ప్రకటిస్తున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య ఒక ప్రకటనలో పేర్కొరన్నారు. తెలుగు భాషాసంస్కృతికి, అభ్యున్నతికి ఈనాడు దినపత్రిక ద్వారా పెద్దపీట వేశారని గుర్తుచేశారు. సహజ పదకోశాలతో అన్యాయానికి గురవుతున్న అనేక మంది ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యల పరిస్కారానికి పత్రిక ద్వారా అవిరళంగా కృషి చేశారని ఆయన సేవలను కొనియాడారు.

శిథిలావ్యవస్థలో తహశీల్దార్ కార్యాలయం

చిన్నపాటి వర్షానికే అవస్థలు-ఫైల్స్‌కు భద్రత కరువు

ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండ తహశీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరింది. వర్షాకాలంలో చిన్నపాటి వర్షానికి నీరు కారుతూ కూర్చోవడానికి ఉద్యోగులు పడుతున్న పాట్లు వర్ణనాతితం. కార్యకలాపాల కోసం వచ్చిన విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, రైతులు, ప్రజలకు అవస్థలు తప్పడం లేదంటున్నారు. మద్రాస్ రాష్ట్ర విభజన తర్వాత కర్నూలు జిల్లా పత్తికొండ మండలంలోని 1827 సంవత్సరంలోని పత్తికొండ తహశీల్దార్ కార్యాలయం ఏర్పాటు చేశారు. తహశీల్దార్‌తో పాటు ఆర్ఐ, విఆర్ఒలు వివిధ శాఖలకు సంబంధించిన ఉద్యోగస్తులు పరిపాలన కొనసాగిస్తున్నారు. పత్తికొండ మండలానికి సంబంధించిన 17 గ్రామపంచాయతీలు సంబంధించిన కొన్ని వేల ఎకరాల భూములు ఉన్నాయి. నిత్యం ప్రజలు కార్యకలాపాల కోసం కార్యాలయానికి వస్తూ వెళ్తుంటారు. అన్నింటికి మించి దాదాపు 197 సంవత్సరాలు నుండి ప్రజలకు సంబంధించిన దస్తావేజులు కార్యాలయంలోని భద్రపరిచారు. ఆ కార్యాలయం శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు పెచ్చులు ఊడి పడుతాయో అని ఉద్యోగులు భయాందోళన చెందుతున్నారు. పెచ్చులు ఊడి పడిన సందర్భాలు ఉన్నాయని ఉద్యోగస్తులు చెబుతున్నారు. 2014 టిడిపి ప్రభుత్వంలో హయాంలో అప్పటి పత్తికొండ ఎమ్మెల్యే డిప్యూటీ సీఎం కెఇ.కష్ణమూర్తి దష్టికి అధికారులు తీసుకెళ్లారు. కెఇ. కృష్ణమూర్తి స్పందిస్తూ 2018 సంవత్సరంలో నూతన తహశీల్దార్ కార్యాలయం ఏర్పాటుచేసి ప్రారంభించారు. ఆ కార్యాలయంలో అధికారులు ప్రజలకు కార్యకలాపాలు కొనసాగాయి. 2021 సంవత్సరంలోనే వైసిపి ప్రభుత్వం పత్తికొండ, తుగ్గలి, మద్దికేర ,వెల్దుర్తి, కృష్ణగిరి, ఆస్పరి, హాలార్వి, హోలగుంద చిప్పగిరి మండలాలను కలుపుకొని పత్తికొండను రెవిన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేసింది. పత్తికొండ తహశీల్దార్ కార్యాలయాన్ని ఆర్‌డిఒ కార్యాలయం పేరు మార్చి కార్యకలాపాలను కొనసాగిస్తున్నారు. తహశీల్దార్ కార్యాలయాన్ని పాత భవనంలోకి మార్చారు. భవనంలో కరెంటు, నీటి సదుపాయం లేక ఉద్యోగులు ప్రజల, అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి నూతన కార్యాలయం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

శిథిలావస్థకు చేరిన పత్తికొండ తహశీల్దార్ కార్యాలయం

నూతన ఎమ్మెల్యే దృష్టి సారించాలి

సిపిఎం మండల కార్యదర్శి రంగారెడ్డి



కొత్తగా ఎన్నికయిన ఎమ్మెల్యే కెఇ. శ్యాంబాబు ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. 68 చెరువులకు నీటిని నింపి, రోడ్డు విస్తరణ పనులు చేయాలి. టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ,పాత కార్యాలయాల సమస్యలను సత్వరమే పరిష్కరించాలి. ప్రధానంగా పత్తికొండ తహశీల్దార్ కార్యాలయానికి రిపేరు చేసి దస్తావేజులకు, సిబ్బందికి, ప్రజలకు న్యాయం చేయాలి.

కొత్త పాలకులయినా పట్టించుకోవాలి

స్పందించకపోతే నగరపాలక సంస్థ ఎదుట బైఠాయిస్తాం

పిపిఎస్ ఎస్ డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

పాణ్యం నియోజకవర్గ పరిధి కల్లూరు అర్బన్ శివారు కాలనీ సత్య కీర్తి నగర్‌లో సమస్యల తిష్ట వేసి మారుమూల గ్రామీణ ప్రాంతం కంటే అధ్వానంగా తయారైందని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, స్థానిక అభివృద్ధి కమిటీ నాయకులు ప్రభాకర్ రెడ్డి,అభిబాబి, సామ్లా బాయ్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఆ ప్రాంతంలో పర్యటించిన అనంతరం వారు మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధి కల్లూరు అర్బన్ సత్యకీర్తి నగర్‌కు అధికార పార్టీకి చెందిన సీనియర్ ఎమ్మెల్యే, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్‌గా ఉండి కూడా ఈ ప్రాంతం నిర్లక్ష్యానికి గురైందన్నారు. కొత్తగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులయినా స్పందించి మా కాలనీ సమస్యలు పరిష్కరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. వర్షం నీరు మా కాలనీని చుట్టుముట్టి ఇంట్లో వారు బయటికి, బయట ఉన్నవారు ఇంటిలోకి రాలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. నగరపాలక సంస్థ అధికారులు భారీగా ఇంటి పన్నులు పెంచడమే తప్ప, ఆ ఇళ్ళ ముందు మట్టిరోడ్డైన వేయాలని స్పృహ కూడా లేదని విమర్శించారు. అధికారులు వెంటనే స్పందించి రోడ్లు మురుగు కాలువల సమస్యలు పరిష్కరించకపోతే ఆఫీసు ఎదుటే బైటాయిస్తామని హెచ్చరించారు. ఈ పర్యటనలో సంఘం నగర నాయకులు కె.శ్రీనివాసులు, సివి వర్మ, ఎస్ఆర్ గౌడు, గోపాల్‌రెడ్డి, నాగేశ్వరరావు, స్థానిక అభివృద్ధి కమిటీ సభ్యులు సురేష్, రామోజీ నాయక్, వెంకట లక్ష్మమ్మ, భారతి, కృష్ణ కాంత్ తదితరులు పాల్గొన్నారు.

కీర్తినగర్ సమ్యను పరిశీలిస్తున్న పిపిఎస్ఎస్ నాయకులు

కౌన్సిలింగు నిర్వహిస్తున్న డిఎస్‌పి జె.బాబుప్రసాద్ , కౌన్సిలింగు నిపుణులు

మహిళల ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యత

దిశా డిఎస్‌పి జె. బాబు ప్రసాద్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

భార్యా భర్తల గొడవలు, కుటుంబ కలహాలు పరిష్కారం దిశగా మహిళల ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యతతో కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నామని దిశా డిఎస్‌పి జె.బాబు ప్రసాద్ అన్నారు. కర్నూలు రేంజ్ డిఐజి సిహెచ్.విజయ రావు, జిల్లా ఎస్‌పి జి.కృష్ణకాంత్ ఆదేశాల మేరకు కర్నూలు దిశ పోలీసుస్టేషన్ లో శనివారం కర్నూలు దిశా డిఎస్‌పి జె.బాబు ప్రసాద్ ఫ్యామిలీ కౌన్సిలింగ్ నిర్వహించారు. పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించిన ఆరు కుటుంబాలకు కౌన్సిలింగ్ నిర్వహించి డిఎస్‌పి మాట్లాడారు. ఇందులో రెండు కుటుంబాలు రాజీ అయ్యాయి. వారికి కుటుంబ గొడవలు, భార్యాభర్తల సమస్యలు, ఇతర మహిళా సంబంధిత ఫిర్యాదుల పరిష్కారంలో సమర్థవంతంగా కౌన్సిలింగ్ నిర్వహించుటకు పలు కీలక సూచనలు చేశారు. మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తూ చర్యలు తీసుకుంటున్నామని, కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నమవుతున్న నేపథ్యంలో ఫ్యామిలీ కౌన్సిలింగ్ చాలా ముఖ్యమైనది అన్నారు. భార్యాభర్తలు చిన్నచిన్న కలహాలు, మనస్పర్థలతో, అనుమానాలు, అపార్థాలు, అసూయా ద్వేషాలతో వారి కుటుంబాలు కుప్ప కూలకుండా నిలబెట్టడంలో ఈ దిశా కౌన్సెలింగ్ సెంటర్ ఎంతగానో దోహద పడుతుందని కర్నూలు దిశా డిఎస్‌పి జె.బాబు ప్రసాద్ పేర్కొన్నారు. కుటుంబ తగాదాలు, భార్య భర్తల గొడవలకు చక్కటి పరిష్కార మార్గం చూపుటకు కౌన్సిలింగ్ సమర్థవంతంగా నిర్వహించుటకు అనుభవజ్ఞులైన ఫ్యామిలీ కౌన్సిలింగ్ సభ్యులతో ప్యానెల్ ఏర్పాటు చేశామని తెలిపారు. కర్నూలు దిశా సిఐలు, ఎస్ఐలు, కౌన్సిలింగ్ నిపుణుడు రిటైర్డ్ లెక్చరర్ సత్యనారాయణ, అడ్వకేట్స్ కావేరి, సైకాలజిస్ట్ పెరుమాళ్ళ లెనిన్ బాబు, ఒన్ స్టాప్ సెంటర్ సిబ్బంది మేరీ , సునీతలు, ఎన్‌జిఒలు, సిబ్బంది పాల్గొన్నారు.

తెగిపోయిన బ్రిడ్జికి మరమ్మతులు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-తుగ్గలి

వర్షాలకు మండల కేంద్రమైన తుగ్గలి, మామిళ్ళ కుంట మధ్య తెగిపోయిన బ్రిడ్జికి వెంటనే మరమ్మతులు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి శ్రీరాములు కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ తీవ్ర వర్షాబావ పరిస్థితులు కారణంగా బ్రిడ్జ్ తెగిపోవడంతో రెండు గ్రామాలకు రాకపోకలు పూర్తిగా బంద్ అయ్యాయని, వెంటనే నిర్మాణం చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా మండలం పరిధిలోని వివిధ గ్రామాలలో ఇల్లు కూలిపోయాయన్నారు. కూలి పోయిన ఇళ్లకు నష్ట పరిహా అందించడమే కాక ప్రధాన మంత్రి యోజన పథకం కింద పక్కా గృహాలు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న వైసిపి ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక

ప్రజా తీర్పును శిరసా వహిస్తాం

- ఎన్నికల సమరంలో తన వెంట నడిచిన ప్రతి కార్యకర్తకు రుణపడి ఉంటా

- వైసిపి ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

వైసిపి కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని, గెలుపోటములు సహజమేనని, సార్వత్రిక ఎన్నికల్లో ప్రజల తీర్పు శిరసా వహిస్తానని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక తెలిపారు. శనివారం వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నియోజకవర్గంలో ప్రజలు తనకు 90 వేల ఓట్లు వేశారని, అతి తక్కువ ఓట్ల తేడాతో ఓటమి చవిచూడాల్సిన వచ్చిందని తెలిపారు. తనపై నమ్మకంతో పార్టీ గెలుపు కోసం కష్టపడి పని చేసిన ప్రతి ఒక్కరికీ, అలాగే ఓటు వేసిన ప్రజలందరికీ ధన్యవాదాలు తెలిపారు. పార్టీ ఓటమి చెందిందని కార్యకర్తలు అధైర్య పడవద్దని, మరోసారి అవకాశం వస్తుందని చెప్పారు. ఇదే పట్టుదలతో ధైర్యంగా ముందుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కార్యకర్తలను కోరారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజల సమస్యలపై పోరాటం చేస్తూ పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మనోధైర్యంగా ఉండి వైసిపిని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు సైనికులాగా పని చేయాలని కోరారు. తాను స్థానికంగా ఉండి పార్టీకి న్యాయం చేస్తానని భరోసా ఇచ్చారు. ప్రజలు ఇచ్చిన తీర్పుకు కట్టుబడి ఉండి, ఎక్కడ తప్పు జరిగిందో అక్కడ బలోపేతం చేసుకోవాలని తెలిపారు. ప్రజలకు ఏవిధంగా సహాయంగా ఉండాలి.. మార్పులు, చేర్పులను గుర్తించి ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తామని వివరించారు.

అక్రమ అడ్మిషన్లపై చర్యలు తీసుకోవాలి

- డిఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఉదయ్

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిలో నిబంధనలను ఉల్లంఘించి అక్రమంగా అడ్మిషన్లు నిర్వహిస్తున్న ప్రయివేట్, కార్పొరేట్ ఇంటర్ కళాశాలపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ధణాపురం ఉదయ్ డిమాండ్ చేశారు. శనివారం ఆదోనిలోని కార్యాలయంలో ఉదయ్ మాట్లాడారు. ఇష్టానుసారంగా ఫీజుల విషయంలో దోపిడీ చేస్తూ అక్రమ అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని విమర్శించారు. అధికారులు తక్షణమే సందర్శించి చర్యలు తీసుకోవాలన్నారు. లేకపోతే ఆందోళనలు చేస్తామన్నారు. డిఎస్ఎఫ్ నాయకులు కిరణ్, మోహన్, హరికృష్ణ, విక్రమ్, తేజ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

- బంటనహాల్ సర్పంచి సుశీలమ్మ

ప్రజాశక్తి - చిప్పగిరి

వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందామని సర్పంచి సుశీలమ్మ గ్రామస్తులకు, మహిళలకు సూచించారు. బంటనహాల్ గ్రామంలో వంకాయల లక్ష్మణ ఇంటి దగ్గర మురుగునీరు నిలబడుతుండం, వాహనాలు వెళ్లడానికి, ప్రజలు నడవడానికి ఇబ్బంది ఏర్పడుతుండడంతో సర్పంచి సుశీలమ్మ స్పందించారు. శనివారం అక్కడ కాలువ మాదిరి తీయించి సిమెంట్ పైపును వేయించి, మురుగు నీరు వెళ్లేలా ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఇంటి పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే దోమలు, ఈగలు వ్యాప్తి చెంది సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉందని తెలిపారు. అందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందామని మహిళలను కోరారు. సర్పంచి తనయుడు సురేష్ పాల్గొన్నారు.

మురుగునీరు నిల్వకుండా సిమెంట్ పైపు ఏర్పాటు

ప్రజాభిమానం మరువలేనిది

మంత్రాలయంలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

కౌతాళంలో ఎమ్మెల్యే బాలనాగిరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

'నియోజకవర్గ ప్రజలే నా దేవుళ్లు, మీరు నాపై చూపుతున్న అభిమానం మరువలేనిది. కలకాలం గుర్తుంచుకుంటాన'ని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని రాంపురం గ్రామంలోని ఆయన స్వగృహంలో వైసిపి నాయకులు అభినందలతో ముంచెత్తారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి హోరుగాలిలో కూడా వైసిపి అభ్యర్థిగా పోటీ చేసిన గెలిపొందిన ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డికి శుభాకాంక్షలు కొనసాగుతున్నాయి. నియోజకవర్గంలోని మండలాలు, గ్రామాల నాయకులు ఆయనను కలిసి శాలువా, పూలమాలలు వేసి, పండ్లు సమర్పించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తనను నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిపించి తిరుగులేని నాయకునిగా నిలిపారని తెలిపారు. ప్రజల రుణం తీర్చుకోలేనిదని, ఎప్పుడు ఎవరికి ఎలాంటి సమస్యలు ఎదురైనా తానున్నానని భరోసా ఇచ్చారు. తాను, తమ సోదరులు సీతారామిరెడ్డి, తమ కుమారులు ప్రదీప్ రెడ్డి, ధరణీధర్ రెడ్డి, మండలాల నాయకులు అందుబాటులో ఉంటామని తెలిపారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

ప్రజాశక్తి - కౌతాళం

మంత్రాలయం నియోజకవర్గ వైసిపి నాయకులు, కార్యకర్తలు అధైర్యపడొద్దని, అండగా ఉంటానని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి తెలిపారు. శనివారం వైసిపి మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాద చారి ఆధ్వర్యంలో దేశాయి గ్రూపు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కౌతాళం మండలం నుంచి మంచి మెజార్టీతో గెలిపించారని, అందుకు అభినందనలు తెలిపారు. ఎప్పుడూ తన కుటుంబానికి అందరూ అండగా ఉండాలని కోరారు. సర్పంచి పాల్ దినకరన్, మాజీ సర్పంచి అవతారం, మాజీ ఎంపిటిసి చౌదరి బసవరాజ్, నాయకులు వెంకోబా, పూజారి లింగన్న, వెంకట రామరాజు, అబ్దుల్ సమద్, ఈరన్న, నాగరాజు, నారాయణ, ఖాదర్ బాషా, భూప పాల్గొన్నారు.

ప్రయివేట్ డిగ్రీ కళాశాలలో సమస్యలను తెలుపుతున్న అధ్యక్షులు వేణుగోపాలాచారి

గత ప్రభుత్వంలో ఇబ్బంది పడ్డాం

- ఎమ్మెల్యే బీవీకి ప్రయివేట్ డిగ్రీ కళాశాలల వినతి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రాష్ట్రంలో, జిల్లాలో ప్రయివేట్ డిగ్రీ కళాశాలలో గత ప్రభుత్వంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నాయని సమస్యలను నూతనంగా ఎంపికైన ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర రెడ్డికి విన్నవించారు. శనివారం ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వరరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రయివేట్ డిగ్రీ కళాశాలలు ఎదుర్కొన్న సమస్యలను వివరించారు. గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో ప్రయివేట్ డిగ్రీ కళాశాలలు దెబ్బతిన్నాయని, వాటిని పరిష్కరించాలని కోరారు. సమస్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు తెలియజేసి పరిష్కరింప చేయాలని కోరారు. స్థానిక సిద్ధార్థ డిగ్రీ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

సమిష్టిగానే పరిపాలన నిర్ణయాలు

- ఏ ఒక్కరి పెత్తనం సహించం - టిడిపి సీనియర్ నాయకులు రామచంద్ర

ప్రజాశక్తి - ఆదోని

నియోజకవర్గంలో పాలనపరమైన, రాజకీయాలకు సంబంధించిన విషయాల పట్ల సమిష్టిగానే నిర్ణయం ఉంటుందని, ఏ ఒక్కరి మాటలు విని మోసపోవద్దని టిడిపి సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్ రామచంద్ర తెలిపారు. శనివారం పట్టణంలోని సిటీ ప్రెస్ కాంపౌండ్‌లో ఉన్న వారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడిపి, జనసేన, బిజెపిల సమన్వయంతోనే పనిచేయగా ఓటర్ల ఆశీర్వాదంతో పార్థసారథి ఎమ్మెల్యేగా గెలిచారని తెలిపారు. ఆదోని అభివృద్ధి కోసం ఎమ్మెల్యే పార్థసారథి ప్రణాళిక కలిగి ఉన్నారన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యేగా పార్థసారథి అధికారికంగా ప్రమాణ స్వీకారం కూడా జరగలేదన్నారు. అప్పుడే నియోజకవర్గంలో స్టోర్ డీలర్, పాఠశాలల మధ్యాహ్న భోజనం ఏజెన్సీ, రెవెన్యూ కార్యాలయం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయం, పోలీసు స్టేషన్లు, మెప్మా కార్యాలయం, కార్యకలాపాలపై పెత్తనం, మట్కా, పేకాట నిర్వహణ, ఇసుక తరలింపు, గ్రావెల్ తవ్వకాలు తామే నిర్వహిస్తామని కొందరు టిడిపి నాయకులు పంచుకున్నట్లు పుకార్లు వస్తున్నాయని తెలిపారు. ఇలా వ్యవహరించడం సబబు కాదన్నారు. అధికారులను బదిలీ చేయడం, ఇక్కడే ఉంచడం వంటి వాటిని కూడా కొందరు పైరవీలు చేస్తున్నట్లు వినికిడి ఉందన్నారు. ఎమ్మెల్యేగా పార్థసారథి ఉన్నా ఆయన అధికారాన్ని అడ్డుకునేందుకు కొందరు అప్పుడే ప్రయత్నాలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. నియోజకవర్గంలో అభివృద్ధి, ప్రజా సమస్యలు, ఇతరత్రా సమస్యల పట్ల కూడా సమిష్టిగానే నిర్ణయం ఉంటుందని చెప్పారు. ఏ ఒక్కరి నిర్ణయం అమలు జరిగితే చూస్తూ ఊరుకోమన్నారు. ఎమ్మెల్యే పార్థసారథి ఊరిలో లేనప్పుడు రాజకీయ ప్రాబల్యం పెంచుకునేందుకు ఎత్తులు వేయడం మంచిది కాదన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో అన్ని రకాల లబ్ధి పొందిన వారిని టిడిపిలోకి చేర్చుకొని అసలైన వారికి అన్యాయం చేసే దిశగా నాయకులు వ్యవహరిస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. అవసరమైతే అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. మాజీ కౌన్సిలర్ మల్లికార్జున, సోమశేఖర్ రెడ్డి, షేక్షావలీ, రామకృష్ణ, మల్లేశప్ప, గోవిందు ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రామచంద్ర

ఆదోని సమస్యలను లోకేష్‌కు వివరిస్తున్న మారుతి నాయుడు

ఆదోని అభివృద్ధికి లోకేష్ హామీ

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిలో నెలకొన్న సమస్యలను మర్చిపోనని, పరిష్కార దిశగా చొరవ చూపుతానని యువగళం పాదయాత్రలో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి ఎమ్మెల్యే లోకేష్ హామీ ఇచ్చారని తెలుగు యువత నాయకులు మారుతి నాయుడు తెలిపారు. శనివారం ఉండవల్లిలో నారా లోకేష్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపి, ఆదోని రాజకీయ పరిస్థితులను రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి బసాపురం వెంకటేష్ చౌదరితో కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రణాళికలు రూపొందిస్తామని తెలిపారు. టిడిపి అధికారంలోకి రావడం కోసం కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఆదోనిని అభివృద్ధి పథంలో నడిపే విధంగా ప్రణాళికలు రూపొందించాలని సూచించారన్నారు. ఆదోనిలో జరిగిన యువగళం పాదయాత్ర విజయవంతంలో పాలుపంచుకున్న వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఆదోని సమస్యల పట్ల లోకేష్ సానుకూలంగా స్పందించారని మారుతి నాయుడు తెలిపారు. పోలినేని సూర్యనారాయణ, వినయ్, లోకేష్, రఘు, రామకృష్ణ పాల్గొన్నారు.

మహారాజశ్రీ మార్కాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఓ.ఎస్. 13/2022

మాస్టర్ గురు ప్రణవ్, వయసు: 6 సం॥
తండ్రి: గురుప్రసాద్, మైనర్, రిప్రజెంటెడ్ బై హిజ్ మదర్/గార్డియన్ పి.రాజమ్మ, భర్త: గురుప్రసాద్
నివాసం: బి-402, సాయిదత్త అపార్ట్‌మెంట్స్
ఈస్ట్ శ్రీనివాస కాలనీ, అమీర్‌పేట,
హైదరాబాద్-500038 ..... వాది

వర్సెస్

మానుకొండ గురవయ్య
మరియు ఏడుగురు ఇతరులు ...... ప్రతివాదులు

2వ ప్రతివాది
మానుకొండ నారాయణమ్మ,
వయసు: 53 సం॥,భర్త: లేట్ పిచ్చయ్య, గృహిణి

5వ ప్రతివాది
మానుకొండ మహేష్, వయసు: 28 సం॥
తండ్రి: లేట్ పిచ్చయ్య, ఎంప్లాయి
పై ఇద్దరి నివాసం: ఇంటి నెం: 151-41-1,
తిలక్ నగర్, కర్నూలు టౌన్, కర్నూలు-518003.

2 మరియు 5వ ప్రతివాదులపై నోటీసు

పై నెంబరు గల కేసు వాది ప్రతివాదులపై భాగహక్కు నిమిత్తం కోర్టులో దావా వేసియున్నాడు. అయితే ఈ కేసులో మీ ఇరువురూ కోర్టు ద్వారా వచ్చిన నోటీసులను తీసుకొనకుండా కాలాయాపన చేయుచున్నారు. కావున పై కోర్టు వారు మీ ఇరువురికీ పేపరు ప్రకటన ద్వారా నోటీసులు జారీ అయ్యేలాగున ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున మీ ఇరువురూ 20-06-2024వ తేదీన ఉదయం 10:30 గంటలకు పై కోర్టు వారి ఎదుట హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడునని ఖండితముగా తెలియజేయడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వులతో //
జె.ఎస్.ఆర్.కృష్ణశాస్త్రి
వాది తరపు అడ్వకేట్,
మార్కాపురం

బియ్యపు గింజలపై మోడీ, బాబు, పవన్ సూక్ష్మ చిత్రాలు

బియ్యపు గింజలపై మోడీ, బాబు, పవన్ చిత్రాలు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణానికి చెందిన సూక్ష్మ కళాకారుడు డాక్టర్ బారికి చంద్రశేఖర్ బియ్యపు గింజలపై మోడీ, బాబు, పవన్‌ల సూక్ష్మచిత్రాలను వేశారు. మూడోసారి ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న నరేంద్ర మోడీకి, ఆంధ్రప్రదేశ్ గెలుపుతో విజయ ఢంకా మోగించిన కూటమి టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుకు, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. శనివారం ఆయన బియ్యపు గింజలపై పెయింటింగ్ వేసి తన కళా నైపుణ్యాన్ని ప్రదర్శించారు.

కేంద్ర మాజీ మంత్రిని కలిసిన ఆదోని ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి ఢిల్లీలో కేంద్ర రక్షణ శాఖా మాజీ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల సాధారణ ఎన్నికల్లో ఆదోని ఎమ్మెల్యేగా విజయం సాధించినందుకు ఆయన శుభాకాంక్షలు తెలిపినట్లు చరవాణి ద్వారా విలేకరులకు తెలిపారు. అనంతరం రాజకీయ విషయాలు వివరించినట్లు తెలిపారు. ఆదోనిలో అభివృద్ధికి సహకరించాలని కోరామన్నారు.

వాల్మీకి ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో

విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు

ప్రజాశక్తి - నందవరం

2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన వాల్మీకి కమ్యూనిటీకి చెందిన విద్యార్థులకు వాల్మీకి మహర్షి ప్రతిభ పురస్కారాలు అందజేశారు. శనివారం మండలంలోని నందవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నందవరం కస్తూరిబా గాంధీ బాలికల ఉన్నత పాఠశాల, నాగలదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ముగతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ముగతి మోడల్ హైస్కూల్, కనకవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఇబ్రహీంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఈ పురస్కారాలు అందజేశారు. శ్రీవాల్మీకి ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల మండల నాయకులు ప్రోత్సాహంతో ఉపాధ్యాయులు టి.ఉసేని, బి.వెంకటేశ్వర్లు, బి.తిమ్మారెడ్డి, బి.నాగరాజు, పి.నారాయణ, బి.వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సరస్వతి విద్యాపీఠం కరస్పాండెంట్ లింగమూర్తి, గ్రామ పెద్దలు ఓ.మల్లేష్, వార్డు సభ్యులు రామాంజనేయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెమొంటోను అందిస్తున్న ఉపాధ్యాయులు

నేడు పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని ఉన్నత పాఠశాలలో 1981-82 విద్యా సంవత్సరంలో చదివిన విద్యార్థులు ఈనెల 9న సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శనివారం పూర్వ విద్యార్థుల సమ్మేళన నిర్వాహకులు, వైష్ణవి గ్రూపు ఛైర్మన్ జీడి లింగప్ప, మల్లెల గ్రూప్స్ అధినేత మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు, మిట్ట శంకర్, మాచాని శివశంకర్, మాచాని ఎర్రి స్వామి, గొల్ల శ్రీనివాస్ యాదవ్, పూర్వ విద్యార్థులు మాట్లాడారు. ఈ సమావేశం ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని, గురువులకు సన్మానం ఉంటుందని తెలిపారు. అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రామోజీరావుకు అశ్రునివాళి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఈనాడు సంస్థల అధినేత, రామోజీ గ్రూప్ ఆఫ్ ఛైర్మన్ రామోజీరావు అనారోగ్యంతో మృతి చెందడం పట్ల శనివారం స్థానిక టిడిపి కార్యాలయంలో టిడిపి నాయకులు నివాళులర్పించారు. రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడారు. రామోజీరావు తెలుగు రాష్ట్రాలకు, దేశానికి చేసిన సేవలు మరువలేమన్నారు. సామాన్య కుటుంబంలో జన్మించి ఎన్నో అపజయాలను తట్టుకొని నిలబడి అనేక విజయాలను అందుకున్నారని గుర్తు చేశారు. ఈనాడు గ్రూపు సంస్థల ద్వారా అక్షర యోధుడుగా పేరున్న రామోజీరావు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశానికి సేవలు అందించారని తెలిపారు. ఈనాడు గ్రూపు సంస్థల స్థాపనతో వేల మందికి ఉపాధి కల్పించారని చెప్పారు. మీడియా రంగంలో రామోజీరావు ప్రత్యేకమైన శకమని కొనియాడారు.

నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

దళిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న దాతలు

బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కోసిగి

దుద్ది గ్రామానికి చెందిన ఎండపల్లి చిన్న మూకయ్య, నాగేంద్రమ్మ దంపతులకు చెందిన గుడిసె శనివారం విద్యుదాఘాతానికి గురై కాలి బూడిదయింది. ఈ ఘటనలో బాధిత కుటుంబ సభ్యుల ఒంటిపై ఉన్న బట్టలు తప్ప అన్ని కాలి బూడిదయ్యాయి. ఇంట్లో ఉన్న నాలుగు క్వింటాళ్ల బియ్యం, రూ.50 వేల నగదు, దుస్తులు, వంట సామగ్రి, టివి పూర్తిగా కాలిపోయాయి. బాధిత కుటుంబ సభ్యులకు గ్రామానికి చెందిన బళ్లారి ప్రదీప్ కుమార్, కిషోర్ కుమార్ తమ మిత్రులతో కలిసి రూ.5 వేల నగదు, 50 కిలోల రేషన్ బియ్యం, ఐదు జతల దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బాధిత కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని తెలిపారు. అలాగే ధైర్యంగా ఉండాలని బాధితులకు సూచించారు. ఈ సంఘటనపై అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిహారం అందే విధంగా చూస్తామన్నారు. తుసెన్ రమేష్, వీరేష్, ఆంజనేయ, బొడ్డయ్య, భీమా రెడ్డి, మూకయ్య, రామకృష్ణ, కామవరం వెంకటేష్, కోసిగి లక్ష్మయ్య పాల్గొన్నారు.

'నీట్'పై విచారణ చేపట్టాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు

ప్రజాశక్తి - ఆదోని

దేశవ్యాప్తంగా నిర్వహించిన నీట్ పరీక్ష ఫలితాలపై సమగ్ర విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శనివారం ఆదోనిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆరుగురు విద్యార్థులకు 720 మార్కులకు 720 రావడం, అందులో ఆ ఆరుగురు విద్యార్థులు ఒకే సెంటర్‌కు సంబంధించిన వారు కావడం పలు అనుమానాలకు దారితీస్తోందని తెలిపారు. రాష్ట్రాల స్వయం ప్రతిపత్తి పట్ల కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా వేలాది మంది ప్రతిభ గల విద్యార్థులు మెడికల్ విద్యకు దూరమవుతున్నారన్నారు. ఈ విద్యా సంవత్సరం ఎన్‌డిఎ విడుదల చేసిన పరీక్షా ఫలితాలపై పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

మహారాజశ్రీ మార్కాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఐ.ఏ. 71/22

ఓ.ఎస్. 13/2022

మాస్టర్ గురు ప్రణవ్,
వయసు : 6 సం॥,తండ్రి: గురు ప్రసాద్,
మైనర్ రిప్రజెంటెడ్ బై హిజ్ మదర్/గార్డియన్
పి.రాజమ్మ, భర్త: గురు ప్రసాద్,
నివాసం: బి.402, సాయిదత్త అపార్ట్‌మెంట్స్,
ఈస్ట్ శ్రీనివాస కాలనీ, అమీర్‌పేట,
హైదరాబాద్-500038 .... పిటీషనర్/వాది

వర్సెస్

1.మానుకొండ గురవయ్య మరియు 7 ఇతరులు
.... రెస్పాండెంట్స్/ప్రతివాదులు

2వ రెస్పాండెంట్
ఎం.నారాయణమ్మ, వయసు : 53 సం॥
భర్త: లేట్ పిచ్చయ్య

5వ రెస్పాండెంట్
మానుకొండ మహేస్, వయసు: 28 సం॥
తండ్రి: లేట్ పిచ్చయ్య
పై ఇద్దరి నివాసం: ఇంటి నెం: 151-4-1,
తిలక్‌నగర్, కర్నూలు-518003.

2 మరియు 5వ రెస్పాండెంట్స్‌పై నోటీసు

పై నెంబరు గల కేసు పిటీషనర్/వాది రెస్పాండెంట్స్/ప్రతివాదులపై భాగహక్కు నిమిత్తం కోర్టులో దావా వేసియున్నారు. అయితే ఈ కేసులో మీకు కోర్టు ద్వారా నోటీసులు పంపిననూ తీసుకొనక కాలాయాపన చేయుచున్నారు. కావున పై కోర్టు వారు మీ ఇరువురికీ పేపర్ ప్రకటన ద్వారా నోటీసులు జారీ అయ్యేలాగున ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున మీ ఇరువురూ 20-06-2024వ తేదీన ఉదయం 10:30 గంటలకు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గానీ లేక ప్లీడరు గారి ద్వారా గానీ హాజరై మీకున్న ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడునని ఖండితముగా తెలియజేయడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వులతో //
జె.ఎస్.ఆర్.కృష్ణశాస్త్రి
వాది తరపు అడ్వకేట్,
మార్కాపురం